క్లుప్తంగా

నేడు వాహనాల వేలం పాట

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను శనివారం వేలం పాట వేస్తున్నట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కృష్ణ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం పాటను తమ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్ : ఈనెల 27వ తేదీన కడప నగరంలోని ప్రైమ్ హాస్పిటల్‌లో షుగర్ వ్యాధి గ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌బీఎస్, పీపీబీఎస్ ఉచిత షుగర్ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. అలాగే కన్సల్టేషన్ ఫీజు పూర్తిగా ఉచితమన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొనదలిచిన వారు 93980 08129కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు ఫెలోషిప్ ప్రోగ్రామ్

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో శనివారం ఫెలోషిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహించబోతున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య విశ్వనాథ కుమార్ తెలిపారు. ఇందులో ఫైనల్ ఇయర్ అప్లైడ్ ఆర్ట్ విద్యార్థులు రూపొందించిన క్రియేటివ్ అడ్వర్టైజింగ్ క్యాంపెయిన్‌లతో కూడిన స్టూడెంట్ షోకేస్ ఉంటుందని తెలిపారు. సామాజిక అంశాలు, ఉత్పత్తుల ప్రమోషన్, బ్రాండ్ ఐడెంటిటీ వంటి విభిన్న థీమ్‌లపై విద్యార్థులు తమ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించడంతో పాటు ఈ ప్రదర్శనలో పోస్టర్లు, డిజిటల్ డిస్‌ప్లేలు వంటి ప్రదర్శన కూడా ఉంటుందన్నారు.

ఉచిత వడుగులుకు పేర్లు నమోదు చేసుకోండి

కడప కల్చరల్ : అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) పీఠాధిపతి, అమీన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో మే 18వ తేది నజ్‌ముల్ అమీన్ పాఠశాలలో పేద బాలురకు ఉచిత వడుగులు నిర్వహించనున్నామని దర్గా ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఈనెల 25వ తేదీ నుంచి మే 16వ తేదీలోగా తమ పిల్లల వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మే 18వ తేదీ ఉదయం 7 గంటలకు వడుగులు నిర్వహణ ఉంటుందని, వారికి వస్త్రాలు, మందులు, నెయ్యి, గోధుమపిండి ఉచితంగా ఇస్తారన్నారు. ఇతర వివరాలకు 94408 37829 , 98852 94737 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

ప్లే స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఓ ప్లే స్కూల్‌పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను డీఈఓ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరం ఎన్జీవో కాలనీలో ఉన్న ఓ ప్లే స్కూల్ ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఒక ఇంట్లో పాఠశాల ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యు నగర అధ్యక్షుడు కొండేటి హరిబాబు పాల్గొన్నారు.

శిక్షణతో క్రీడల్లో రాణింపు



మాట్లాడుతున్న పాస్టర్ విక్టర్‌బాబు

కడప కల్చరల్ : క్రీడల్లో శిక్షణ తీసుకుంటే ఆ రంగంలో రాణించే అవకాశం ఉందని సీఎస్‌ఐ చర్చి ప్రాజెక్టు డైరెక్టర్ జేకబ్ ప్రశాంత్ అన్నారు. శుక్రవారం కడప నగరంలోని సీఎస్‌ఐ మైదానంలో సాయంత్రం వాలీబాల్ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రఫా సంస్థ ద్వారా ఈ శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్షకుల సూచనలు, సలహాలను తప్పక పాటించి క్రమశిక్షణతో నేర్చుకున్నప్పుడే ఇందులో పూర్తి స్థాయిలో రాణించే అవకాశం ఉందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ విక్టర్‌బాబు మాట్లాడుతూ క్రీడలు జీవితంలో ఒక భాగమని, ఇష్టమైన క్రీడను ఎంచుకుని నిపుణుల మార్గదర్శకత్వంలో సాధన చేస్తే ఉన్నత స్థాయిలో రాణించవచ్చని తెలిపారు. విశిష్ట అతిథి, జిల్లా స్కూల్ గర్ల్స్ ఫెడరేషన్ కార్యదర్శి అరుణకుమారి, సీనియర్ ఉపాధ్యాయులు నిత్య ప్రభాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ కోచ్ అమృత రాజు, సీనియర్ ఉపాధ్యాయులు సాజిద్, రఫా సంస్థ నిర్వాహకులు అగస్టీన్ పాల్గొన్నారు.

నేడు గంధం

కడప కల్చరల్ : కడప నగరం గండి వాటర్ వర్క్స్ వద్ద గల హజరత్ సయ్యద్‌షా బంగ్లే షావలీ దర్గా ఉరుసు శనివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఇంటి నుండి మేళతాళాల మధ్య గంధాన్ని పురవీధుల నుండి గండి దర్గాకు చేర్చనున్నారు. రాత్రి 7 గంటలకు గంధాన్ని సమర్పిస్తారు. అన్నదానం, ఆ తర్వాత ఖవ్వాలీ గాయకులు అసద్ నిషాద్ సాబ్రీ మీరట్ ఖవ్వాలీ కచేరి నిర్వహించనున్నారు.

హిందువుల సహనాన్ని పరీక్షిస్తే ఉపేక్షించం



కడప నగరంలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న స్వామీజీలు



ర్యాలీలో క్యాండిల్‌లతో నిరసన తెలుపుతున్న మహిళలు

- హిందూ జేఏసీ భారీ ర్యాలీ
- పాల్గొన్న విద్యార్థులు, మహిళలు
- పాక్, బంగ్లాల పతాకాలు, దిష్టిబొమ్మ దగ్ధం
- పాల్గొన్న స్వామిజీలు

కడప కల్చరల్ : హిందువుల సహనాన్ని పరీక్షిస్తే ఇక ఉపేక్షించబోమని హిందూ జేఏసీ ప్రతినిధులు ముక్త కంఠంతో హెచ్చరించారు. శుక్రవారం హిందూ సంఘాల జేఏసీ ప్రతినిధులతోపాటు పలు దేవాలయాల కమిటీ సభ్యులు, కళాశాలల విద్యార్థులు నగరంలోని కోటిరెడ్డిసర్కిల్ వద్దగల స్టేట్ గెస్ట్‌హౌస్ వద్దనుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. హిందూ మహిళలు సైతం ర్యాలీలో పాల్గొనడం విశేషం. ఈ ర్యాలీలో దాదాపు అందరూ త్రివర్ణ పతాకాలు, కాషాయ పతాకాలు చేతబూని భారత్‌మాతాకు జై అంటూ నినాదాలు చేస్తూ సాగారు. బ్రహ్మంగారిమఠం అచలానంద ఆశ్రమానికి చెందిన స్వామి విరజానంద సరస్వతి, చిన్మయ మిషన్ జిల్లా అధ్యక్షులు స్వామి తురియానంద సరస్వతి మార్గదర్శనంలో ఈ ర్యాలీ సాగింది. ముందుగా దేశభక్తి గీతాలను ఆలపిస్తున్న ప్రత్యేక వాహనం , ఆ వెనుక స్వామిజీలు, ఇతర ఆధ్యాత్మిక వేత్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

ర్యాలీ ఇలా..

కోటిరెడ్డిసర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నాగరాజుపేట, పాత బస్టాండు మీదుగా ఏడురోడ్ల కూడలికి చేరుకుంది. అక్కడ ర్యాలీలో పాల్గొన్న వారంతా కొవ్వొత్తులు వెలిగించి పెహల్గావ్ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా స్వామి విరజానంద సరస్వతి మాట్లాడుతూ పెహల్గావ్ సంఘటన హేయమైన చర్య అని, అమానుషమని, ఇది హిందువులపై జరిగిన దాడిగా భావిస్తున్నట్లు తెలిపారు. బాధితులకు ఓదార్పుగా వారి కుటుంబాలకు సంతాపం తెలిపేందుకే హిందువులంతా ఐక్యంగా నిలిచి ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్, ఆశ్రయమిస్తున్న బంగ్లాదేశ్‌లు హద్దులు దాటాయని, ఇక ఇలాంటి ఘటనలను ఉపేక్షించేది లేదని, ఘాటైన ప్రతీకార సమాధానం తప్పదని హెచ్చరించారు. హిందువులు ప్రపంచ శాంతిని కోరేవారని మరోమారు గుర్తు చేస్తున్నామన్నారు.

- స్వామి తురియానంద సరస్వతి మాట్లాడుతూ పెహల్గావ్ సంఘటనలో కేవలం హిందువులనే టార్గెట్ చేయడం సహించరాని విషయమని, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలు దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హిందువులపై ఇంత కక్ష దేనికని ప్రశ్నించారు. బంగ్లా దేశాన్ని ఏర్పాటు చేసిన హిందూ దేశానికి రోహింగ్యాలు ముప్పు తెచ్చేలా ప్రవర్తించడం సరికాదన్నారు. సమైఖ్య బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షులు విజయభట్టర్ శాంతిమంత్రం ఆలపించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పలుచోట్ల పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల పతాకాలను, ఆ దేశాల నాయకులను పాదరక్షలతో కొట్టి చింపివేశారు. ఏడురోడ్ల వద్ద పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఉగ్ర దాడిపై సచివాలయ ఉద్యోగుల నిరసన



కాశ్మీర్ ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

కడప కార్పొరేషన్: కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ గ్రామ వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు జాతీయ జెండాలు చేతబూని నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు హీరా మియా మాట్లాడుతూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడి అత్యంత దుర్మార్గమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు చేయడానికి భయపడేలా శిక్ష వేయాలన్నారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో సహా పెకలించి వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కడప నగర అధ్యక్షులు హేమ సుందర్ రాజు, కమిటీ సభ్యులు కిరణ్ కుమార్ రెడ్డి, ఉదయ్, సురేష్ బాబు, ప్రసాద్, మనోరంజన్, సుధాకర్, మస్తాన్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

టూరిస్టులపై దాడి పిరికి పందచర్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జమ్ము కాశ్మీర్ లోని పహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్ర దాడి పిరికి పంద చర్య అని డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు కదిరి ప్రసాద్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

నేడు ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్ : జమ్ముకశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు 26 మందిని కిరాతకంగా కాల్చిన సంఘటనపై శనివారం కడప నగరంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడుతూ ర్యాలీలో పాల్గొనాలని నగర వాసులను ఆహ్వానించారు. ఉగ్రవాదుల దాడి దేశ వాసుల హృదయాలను కలచివేసిందన్నారు. ఉగ్రవాదులపై పిడికిలి బిగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అందుకోసం పర్యాటకులపై జరిగిన ఈ ఉగ్ర దాడిని ఖండిస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ర్యాలీ సాయంత్రం 5 గంటలకు స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహిస్తున్నట్లు, మేధావులు, అభ్యుదయవాదులు ఉద్యోగులు ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి. డాక్టర్ రాజా వెంగల్‌రెడ్డి, బి.లక్ష్మీ రాజా, డాక్టర్ ఫరూక్, ఇలియాస్ బాష, చంద్రశేఖర్, రవిశంకర్ రెడ్డి, వెంకట శివ, సుల్తాన్, నాజర్ పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అణిచి వేయాలి



పాకిస్తాన్ జెండా గుర్తుగల చిత్రాన్ని దగ్ధం చేస్తున్న యువకులు

కడప సెవెన్‌రోడ్స్ : జమ్ముకశ్మీర్ పెహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకుల పైన కాల్పులు జరిపి అయామకుల ప్రాణాలు బలిగొన్న ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ ఉగ్రవాద చర్యలను ఉక్కుపాదంతో అణిచి వేయాలని పలువురు ముస్లిం యువకులు డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో వారు పాకిస్తాన్ జెండాతో కూడిన చిత్రాలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో పర్యాటకులు మృత్యువాతపడ్డారన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన కుటుంబానికి 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. పాకిస్తాన్ దేశాన్ని ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని ఐక్యరాజ్య సమితిని కోరుతున్నామన్నారు. ఉగ్రవాదం అణిచి వేసేందుకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో పఠాన్ ఖాదర్‌బాష, ఆరిఫ్, రఫీ, ఎస్‌ఎండి రఫీ, శంకర్, సయ్యద్ పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం



అమ్మవారికి పూలను సమర్పిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ తల్లికి శుక్రవారం పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. వారం రోజులుగా జరుగుతున్న అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి నిర్వాహకులు భక్తులు సమర్పించిన 21 రకాల పూలు, 21 రకాల ప్రసాదాలను అమ్మవారికి నివేదించారు. నిర్వాహకులు గోపాల్‌సింగ్ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారిని కనువిందుగా అలంకరించారు. అనంతరం ఒక్కొక్కరకం పూలను అమ్మవారికి నివేదించి యాగం పూర్తి చేశారు. ఈ కార్యక్రమం తర్వాత ఏకాంత సేవ నిర్వహించి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు, పూజలో వాడిన పూలను అందజేశారు.

గురుపూజోత్సవం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరగాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మే 4వ తేదీ నుంచి జరిగే బ్రహ్మంగారి గురుపూజ ఆరాధన మహోత్సవాన్ని జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరిపించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. భక్తుల కోసం దాతలు మంచినీరు, మజ్జిగ, అన్నదానం వంటివి ఏర్పాటు చేస్తే ఫిట్ పర్సన్, సిబ్బంది తమ ఖాతాలో వేసుకుని లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఉత్సవాలను జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరిపించాలని తాము కోరుతున్నామన్నారు. అలాగే మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులను మార్కుల యంత్రాలుగా కాకుండా, సమాజంలో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకొని సమ సమాజం నిర్మించుటలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు లక్ష్మీరాజా పేర్కొన్నారు. శుక్రవారం కడపలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎస్ వి ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులు -మార్కులు, యంత్రాలు - విలువలు అనే అంశం మీద ప్రజా సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బి లక్ష్మీరాజా, యస్వీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డిలు మాట్లాడుతూ విశాఖపట్నం ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకురాలిపై ఓ విద్యార్థి చెప్పుతో దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రుల పైన, సమాజం పైన, ఉపాధ్యాయ అధ్యాపకుల పైన ఉందన్నారు. ఇటీవల కాలంలో స్వల్ప దండనలకు కూడా విద్యార్థుల తల్లిదండ్రులు జోక్యం చేసుకొని గురువులపై దాడులకు తెగబడడమనేది సమాజాన్ని అట్టడుగుకు తీసుకు వెళ్లేలా కనిపిస్తోందన్నారు. ప్రస్తుతం విద్యార్థుల బోధనాంశాలలో నీతి కథలు, మారల్ పీరియడ్స్, లాంగ్వేజ్‌లలో విద్యార్థుల నిజ జీవితానికి అవసరమైన పాఠ్యాంశాలు లేకపోవడం ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఒక లోపంగా కనిపిస్తోందన్నారు. పెద్దల పట్ల గురువుల పట్ల వినయ విధేయతలతో ఉండటం తల్లిదండ్రులను గౌరవించడం పాఠశాల స్థాయి నుండి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్1938 జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి ఏపీటీఫ్ 257 నాయకులు నరసింహులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్: ప్రపంచ కార్మికుల దినోత్సవం (మే డే)ను జయప్రదం చేయాలని విద్యుత్ సంస్థలోని వివిధ అసోసియేషన్ల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మే డే కరపత్రాలను ఏఐటీయూసీ అనుబంధ సంఘాలైన ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, గ్రామ వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్, విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే మల్లికార్జున రెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ట్రాన్స్‌కో కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినమన్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కృపాకర్, ప్రకాష్ రావు, హాజీ భాష, కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు ప్రసాద్, రామాంజనేయరెడ్డి, శివరామిరెడ్డి, నరసింహులు, ఉదయ్ కుమార్, రమణ నాయక్, విజయ్ కుమార్, రఘు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మే డే ను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే ను జయప్రదం చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బండి. రామలింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నాటి. బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని కడప డివిజన్ కార్యాలయంలో మే డే కు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దస్తగిరి, రామ చంద్రా రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, కొండారెడ్డి, సురేష్, ఎనర్జీ అసిస్టెంట్ నాయకులు, ఆజీ బాషా తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను మట్టుపెడదాం



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

కడప రూరల్: మలేరియా వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి నగరంలో ర్యాలీని నిర్వహించారు. ఐటీఐ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మలేరియా నిర్మూలనకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 2024లో 15 కేసులు నమోదు కాగా 2025లో ఇప్పటి వరకు ఒక కేసు మాత్రమే నమోదైందని పేర్కొన్నారు. పెద్దముడియం, వద్దిరాల, జమ్మలమడుగు, మైలవరం తదితర ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యా, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, ఆర్ డబ్ల్యూ ఎస్, అంగన్‌వాడీ శాఖల సమన్వయంతో మలేరియా నిర్మూలనకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, జిల్లా మలేరియా అధికారి మనోరమ, డీఎల్‌ఓ విజయభాస్కర్, ఎస్‌ఓ రమేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఖాజామోహిద్దీన్, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం

కడప ఎడ్యుకేషన్: బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు వైయస్సార్ ప్రెస్ క్లబ్‌లో జనగణనలో కులగణన చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని, దీనిని జయప్రదం చేయాలనీ బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్ కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొంటున్నారని, ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీల నేతలకు, ప్రజా సంఘాలకు ఆహ్వానం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ నాయకులు రాము, శ్రీనివాసులు, నవీన్, శివ, మనోజ్, ఉదయ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి జైలు

కడప అర్బన్: మద్యం తాగి ద్విచక్ర వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన పాలెం ఆరోగ్యస్వామికి 14రోజుల జైలు శిక్ష, రూ 2500 జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ మంగళగౌరీ తీర్పు ఇచ్చారు. ఈనెల 24వ తేదీ మద్యం తాగి మోటార్ సైకిల్ నడుపుతుండగా ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ అనలైజర్ సహాయంతో తనిఖీ నిర్వహించగా ఆరోగ్యస్వామి పట్టుబడ్డాడు. దీంతో కడప ట్రాఫిక్ సీఐ డి.కె జావీద్ కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ విచారించి శిక్ష, జరిమానా విధించారు.

27న అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని తేజ పెట్రోల్ బంక్ పక్కన గల శంకర్ రెడ్డిస్ సాయి బాలాజీ కోచింగ్ సెంటర్‌లో ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు డీఎస్సీ, గ్రూపు-2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎ. శంకర్ రెడ్డి తెలిపారు. వివరాలకు 99667 87871, 88861 42609 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రిమ్స్‌లో ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ మూసివేత



కడప అర్బన్: కడప నగర శివార్లలో వున్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో ఆడిటోరియంకు ఎదురుగా గత కొన్ని సంవత్సరాల క్రితం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) వారు ఏటీఎం సెంటర్‌ను ప్రారంభించారు. ఎస్‌బీఐ బ్యాంక్ బ్రాంచ్ వారు కళాశాలలో బ్రాంచ్ సేవలను నిర్వహిస్తున్నారు. కానీ ఏటీఎం కేంద్రంను గత మూడు నెలలుగా మూసివేయడంతో రోగులు, వారి సహాయకులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బ్యాంక్ అధికారులకు చెప్పినా వారు బ్యాంక్ ఖాతాదారుల నుంచి ఫిర్యాదులను తమ ఉన్నతాధికారులు స్వీకరించి వుంటారని, త్వరలోనే నిపుణులు వచ్చి మరమ్మతులు చేస్తారని చెప్పుకొస్తున్నారు. మరోవైపు రిమ్స్ ఆవరణలోనే శుక్రవారం డీసీసీ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో మొబైల్ ఏటీఎం వ్యాన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏటీఎం కేంద్రం ద్వారా కొందరు నగదు లావాదేవీలను జరుపుకున్నారు.

ఆహార పదార్థాల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపకు చెందిన గాండ్ల రఘుస్వామి, ప్రభాకర్‌లు శుక్రవారం పేదలు, యాచకులకు ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. తమ తండ్రి మోహన్‌ను స్మరించుకుని వారు అల్పాహారమైన ఇడ్లీ ప్యాకెట్లతోపాటు అన్నదానం, వంద మందికి మజ్జిగ ప్యాకెట్లు, 120 బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్థానికుడు ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

పెండ్లిమర్రి : పంటలు సాగు చేసే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంట సాగు చేసేలా ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం 2025-26 సంవత్సరం ఖరీఫ్ ప్రణాళికలపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయం గురించి విస్తృతంగా రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఏఓ ఓబులేసు, ఏపీఎం బాలస్వామి, మాస్టర్ ట్రైనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కాన్పులు సురక్షితం

వల్లూరు : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది గర్భిణులకు అవగాహన కల్పించాల్సిన అవసరం వుందని డీపీఎంవో డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వీలైనంత వరకు కాన్పులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడారు. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు వంద శాతం టీకాలు వేయించాలని సూచించారు. మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన చర్యలను గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర, సీహెచ్‌వో వేణుగోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.